## క్లుప్తంగా

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏఓ నరేశ్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: దుకాణదారులు ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి నరేశ్ హెచ్చరించారు. రాయపోల్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. కాలం గడిచిన విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమ్మకాలలో నిబంధనల గురించి దుకాణదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లైసెన్సులు ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓలు, డీలర్లు ఉన్నారు.

### సాంకేతిక పరిజ్ఞానం చాలా కీలకం



ఈ పేపర్‌ను ప్రారంభిస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్: సాంకేతిక పరిజ్ఞానం చాలా కీలకంగా మారిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. జన జాగృతి కళా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన సాహిత్య మాసపత్రిక ఈ పేపర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జనజాగృతి సంస్థ సోషల్ మీడియా వేదికగా కవి సాయంత్రం అనే సాహిత్య గ్రూపును నిర్వహించడం అభినందనీయమన్నారు. పదేళ్లుగా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్‌ను లింగమూర్తి అభినందించారు.

### ఆకట్టుకున్న మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

కొండపాక(గజ్వేల్): కొండపాక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నుంచి ఓటుహక్కు వినియోగం వరకు జరిగే కార్యక్రమాల గురించి ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగిపోయి ఓటుహక్కు విలువను దిగజార్చకూడదన్నారు. సమాజ అభివృద్ధికి పాటు పడే వారిని ఎన్నుకునేలా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వాసవి కన్యకాపరమేశ్వరి మాతకు పూజలు



పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కొమురవెల్లి(సిద్దిపేట): ఆర్యవైశ్యమహాసభ మహిళా విభాగం, మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కన్యకాపరమేశ్వరిమాతని శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి భజనలు, సాముహిక పారాయణం, కుంకుమ అర్చన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో నాగరాణి, నీలిమ, అర్చన, నగేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### విముక్తి కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంలు

తొగుట(దుబ్బాక): మధ్యాహ్నభోజన బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి హెచ్ఎంలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహణ తలకుమించిన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను పూర్తిగా విద్యాబోధనకే పరిమితం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గం చూడాలని సూచించారు. మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

# వానల్లేక.. సాగు సాగక..

రైతులు కోటి ఆశలతో వానాకాలం వరి సాగుకు సిద్ధమయ్యారు. కానీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పోసిన వరి నార్లు ముదిరి పోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



కోహెడలో ముదురుతున్న వరినారు

**ప్రశ్నార్థకంగా మారిన వరి పంట**
- సమృద్ధిగా కురవని వర్షాలు
- ముదురుతున్న నారు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

కోహెడ(హుస్నాబాద్): వానాకాలం వరిసాగు కోసం రోహిణి, ఆరుద్ర, మృగశిర కార్తెలలో రైతులు వరి నార్లు పోశారు. ఆశించినంతగా వర్షాలు కురవకపోవడంతో నారుపోసి నెల గడిచినా దుక్కులు దున్నలేదు. నాట్లు వేయలేదు. దీంతో పోసిన నారు ముదిరిపోతోంది. ఈ వారంలో మొస్తారు వర్షాలు కురవాలని, లేదంటే ఆగస్టు మొదటి వారంలో వర్షాలు సమృద్ధిగా కురిస్తే తప్ప సాగు సాగదని రైతులు, అధికారులు చెప్తున్నారు.

**సాగు ఇలా..**

వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం.. ఈ వానాకాలంలో వరి సాగు విస్తీర్ణం 23,500 ఎకరాలు. అయితే ఇప్పటి వరకు బోర్లు, బావులపై ఆధారపడిన వారు సుమారు 500 ఎకరాలలో వరినాట్లు వేశారు. యూరియా 3,500 మెట్రిక్ టన్నులు, డీఏపీ 900 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2,300 మెట్రిక్ టన్నులు, పొటాష్ 1,550 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారులు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేసి రానున్న యాసంగికి సాగునీరు అందే విధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

**నారు ముదురి పోతుంది**



నీరు లేక పొలం మడులు కూడా దున్నలేని పరిస్థితి. వరి నారుపోసి నెల దాటింది. నారు ముదిరిపోతుంది. నెలలోపు నాట్లు పడితేనే దిగుబడి ఎక్కువగా వస్తుంది. రెండు, మూడు వానలు కురిస్తేనే తప్ప నాట్లు పడవు. వర్షాలు లేకుంటే సాగు కష్టమే..
– గూడ చంద్రయ్య, రైతు, కోహెడ

**దిగుబడి కోసం దిగులు పడొద్దు**



సన్నరకం వరినారు 45 రోజులైనా నాట్లు వేసుకోవచ్చు. దొడ్డు రకం 35 రోజులైనా పరవాలేదు. దిగుబడిలో ఎలాంటి మార్పు ఉండదు. వర్షాల కోసం ఎదురు చూడకుండా నీటి సామర్థ్యాన్ని బట్టి నాట్లు వేసుకోవాలి. రైతులు దిగుబడిపై ఆందోళన చెందవద్దు. సాగుకు సరిపడా ఎరువులు, విత్తనాలు దుకాణాలలో అందుబాటులో ఉన్నాయి.
– సతీశ్, ఏఓ, కోహెడ

# మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

విద్యార్థులు, యువత అపరిచితుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని పోలీసు అధికారులు సూచించారు. సీఐలు, ఎస్ఐలు మంగళవారం వివిధ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- విద్యార్థులకు పోలీసుల సూచన
- వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు



ప్రశాంత్‌నగర(సిద్దిపేట): మాట్లాడుతున్న త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు



చిన్నకోడూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న ఎస్ఐ సైఫ్ అలీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్)/హుస్నాబాద్‌రూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు, యువత సోషల్ మిడియాకు దూరంగా ఉండాలని, సిద్దిపేట త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం, నూతన చట్టాలు, మహిళా చట్టాలు, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. సెల్‌ఫోన్‌ల వల్ల మంచితోపాటు చెడు కూడా ఉందని, అవసం మేరకు వినియోగించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికలను ఎవరైనా వేధిచింనా, అవహేళనగా మాట్లాడినా వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీం నంబర్ 87126 67434కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కుకునూరుపల్లి హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో విలువ పెరుగుతుందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం ఉందని, చదువుకునే దశలో చెడు ఆలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగంతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా షీ టీంలను ఏర్పాటు చేసిందని, ధైర్యంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి శ్రీచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు అజయ్‌రెడ్డి, ఏఎస్ఐలు సువర్ణ, జగదీశ్వర్, షీ టీం పోలీసులు పాల్గొన్నారు. హుస్నాబాద్ రూరల్ మండలంలోని జిల్లెలగడ్డ ఎస్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఎస్ఐ లక్ష్మారెడ్డి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ర్యాగింగ్ గురించి వివరించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నకోడూరులో పోలీసు కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్ఐ సైఫ్ అలీ మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నిరవాణకు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని సూచించారు. మూఢ నమ్మకాలను విడనాడాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

### స్వచ్ఛతలో భాగస్వాములుకండి

హుస్నాబాద్: మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. 16వ వార్డులోని పబ్లిక్ టాయిలెట్లను పర్యవేక్షించారు. సీపీఐ భవన్ సమీపంలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఇన్‌చార్జి ఆర్ఐ ప్రసాద్, పర్యావరణ అధికారి రవి కుమార్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

### గంజాయి రహిత జిల్లానే లక్ష్యం



కిరాణా దుకాణంలో తనిఖీలు

సిద్దిపేటకమాన్: గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు పిలుపునిచ్చారు. పట్టణం, ఇమాంబాద్ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి నార్కోటిక్ డాగ్స్‌తో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు ఎవరు విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సీఎం సహాయనిధి పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4,17,500 విలువగల చెక్కులను స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మంగళవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, స్వామి, ప్రవీణ్, విజయ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, భూపాల్‌రెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడారంగం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

**జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటనర్సయ్య**



స్టేడియాన్ని పరిశీలిస్తున్న వెంకట నర్సయ్య తదితరులు

గజ్వేల్: క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా యువజన క్రీడల అధికారి జంగపల్లి వెంకట నర్సయ్య అన్నారు. గజ్వేల్‌లోని మినీ స్టేడియంను మంగళవారం ఆయన సందర్శించి సౌకర్యాల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన క్రీడా పాలసీలో భాగంగా కోచ్‌ల నియామకం, క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లను పక్కాగా అమలు చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఈసారి సీఎం కప్ పోటీల్లో పాల్గొని రాణించే క్రీడాకారులకు రిజర్వేషన్లు కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గణేశ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యుడు శ్రీనివాసవర్మ, వాలీబాల్ అసోసియేషన్ నాయకులు సంతోష్, ఫుట్‌బాల్ కోచ్ నర్సింహులు, పిజికల్ డైరెక్టర్ నగేశ్, క్రీడాశాఖ సిబ్బంది పండరి రాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

గజ్వేల్‌రూరల్: బెజుగామ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ జగదీశ్‌ఆర్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా జాలిగామ, బెజుగామ, చిన్న ఆరెపల్లి, రాయపోల్ మండలంలోని పెద్ద ఆరెపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

**• సర్టిఫికెట్లను అప్‌డేట్ చేయించుకోవాలి**

నంగునూరు(సిద్దిపేట): పాలిసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో డిప్లొమా కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులు 18లోపు సర్టిఫికెట్లను అప్‌డేట్ చేసుకోవాలని రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త గోవర్ధన్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాలిసెట్ కౌన్సెలింగ్‌కు హాజరైన రసీదు, ఏడు నుంచి పదో తరగతి బోనఫైడ్, ఆధాయ ధ్రువీకరణ పత్రాన్ని సమీపంలోని పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో నమోదు చేయించాలన్నారు. వారికి ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తుందని చెప్పారు.

**• క్రీడా దుస్తుల పంపిణీ**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు మల్లారం గ్రామానికి చెందిన సందబోయిన బక్కయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎల్లయ్య మంగళవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య, ప్రిన్సిపాల్ సతీశ్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ ప్రవీణ్ పాల్గొన్నారు.

**• స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి**

హుస్నాబాద్: రానున్న స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం అక్కన్నపేట మండలస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.

**• బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం**

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, బూరగోని తిరుపతి, భీరెడ్డి ఇన్నారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ సన్నాహక సమావేశాల్లో భాగంగా మండలంలోని తాడూరు, చిట్యాల, దానంపల్లిలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రామ్మోహన్ రావు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నసైజు కోడిగుడ్ల సరఫరాపై ఆగ్రహం

**ఫుడ్ కమిషన్ సభ్యుల తనిఖీలు**



కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి

బెజ్జంకి(సిద్దిపేట): అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఇచ్చే కోడిగుడ్లు చిన్నగా ఉండటంపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెజ్జంకి, వీరాపూర్, బేగంపేట గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను ఫుడ్ కమిషన్ సభ్యురాలు భారతితో కలిసి మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నసైజు కోడిగుడ్లను సరఫరా చేసిన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు సూచించారు. ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. నిర్వాహణ లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందించేలా అవగాహన కల్పించడానికి మండలంలో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అయితే సకాలంలో తమ బిల్లులు ఇప్పించాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఆయనను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓ మహతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వన సంరక్షణతోనే స్వచ్ఛమైన ఆరోగ్యం

**రాష్ట్ర అటవీ సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్**



మొక్కకు నీళ్లు పడుతున్న ప్రియాంక వర్గీస్

కొండపాక(గజ్వేల్): వన సంరక్షణలతోనే స్వచ్ఛమైన ఆరోగ్యాన్ని పొందగలమని రాష్ట్ర అటవీ సంరక్షణ అధికారి(సీసీఎఫ్) ప్రియాంక వర్గీస్ అన్నారు. మండలంలోని దుద్దెడ శివారులోని ఆక్సిజన్ పార్కులో వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. పార్కులో మొక్కల సంరక్షణను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందేలా మొక్కలను పెంచుతున్నారన్నారు. మొక్కలను సంరక్షించడంతో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, ఇక్రముద్దిన్, రమేశ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ పెంచితేనే జీవితాలు మెరుగు

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత లక్ష్మీనారాయణ**



సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు

హుస్నాబాద్: దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలు పెంచితేనే వారి జీవితాలు మెరుగు పడతాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం దివ్యాంగుల హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.500 నుంచి రూ4 వేలకు పెరిగిందంటే అది మంద కృష్ణ మాదిగ ఘనతేనన్నారు. సిద్దిపేటలో బుధవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి మంద కృష్ణ హాజరవుతున్నారని, ఎమ్మార్పీఎస్ నాయకులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో చంద్రమౌళి, కొమురయ్య, సమ్మయ్య, రాజేశం, సరిత, కనుకవ్వ పాల్గొన్నారు.

## వరుణుడా.. కరుణించవా!

నారుపోసి నెల రోజులు గడిచినా చినుకు జాడ లేక రైతులు వర్షాల కోసం అల్లాడుతున్నారు. నారు మడులు ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ ఆడి వానలు కురవాలని వేడుకుంటున్నారు.



మద్దూరు(హుస్నాబాద్): ఖాళీ బిందెలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నంగునూరు(సిద్దిపేట): పోచమ్మ ఆలయం ఎదుట మహిళలు, చిన్నారుల పూజలు

# కర్తవ్య నిర్వహణలో పక్షపాతం ఉండొద్దు

**ఏసీపీ నర్సింహులు**



వీడ్కోలు సభలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని, ఎక్కడికి వెళ్లినా ఎలాంటి పక్షపాతం లేకుండా కర్తవ్యాన్ని నిర్వహించాలని ఏసీపీ నర్సింహులు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్ఐలకు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన పాల్గొన్నారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీ కానున్న శ్రీరామ్ ప్రేమ్‌దీప్, రాయపోల్ మండల ఎస్ఐ రఘుపతికి వీడ్కోలు పలుకుతూ నూతనంగా వచ్చిన దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్, రాయపోల్ ఎస్ఐ మానసకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, బేగంపేట, తొగుట, కుకునూరుపల్లి ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యమే మహాభాగ్యం



బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐకేపీ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు



దౌల్తాబాద్(దుబ్బాక): ఇందూప్రియాల్ పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకున్న మహిళలు



జగదేవ్‌పూర్(గజ్వేల్): వైద్యాధికారిని సత్కరిస్తున్న మహిళలు

మహిళ ఇందిరా శక్తి సంబురాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు మండలాల్లోని పీహెచ్‌సీలలో మహిళా సంఘం సభ్యులు, వీఓఏలు, ఓబీలకు వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం వివిధ రకాల పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని పలువురు మహిళ సంఘం సభ్యులు సూచించారు.